క్లుప్తంగా

సమాజ హితం కోసం వాసవీ క్లబ్ సేవలు

అనపర్తి: సమాజ హితం కోసం వాసవీ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ నార్కెడుమిల్లి సుబ్బారావు అన్నారు. అనపర్తి వాసవీ ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో ఆ గ్రామ శివారున గల సాయిబాబా వృద్ధాశ్రమంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు మన్యం పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ నార్కెడమిల్లి సుబ్బారావు దంపతులు ఆశ్రమంలోని సుమారు వంద మంది వృద్ధులకు అన్న వితరణ చేశారు. బిస్కెట్లు, పండ్లు, లుంగీలు, టవళ్లు, చీరలు అందించారు.అనేజ తొలుత వృద్ధుల కోసం ఆటలు, నృత్యం, గానలహరి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చక్కా గౌరీ, కోశాధికారి చక్కా సునీత, సీఎంఆర్ ఇన్‌చార్జి వెచ్చ రత్నకుమారి, మెగా ఈవెంట్ ఇన్‌చార్జి గ్రంధి సుజాత, కుమారి పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



తొస్సిపూడి ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న డైట్ అధ్యాపకుడు సత్య ప్రకాష్

బిక్కవోలు: ఫౌండేషన్ న్యూమరసీ అండ్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా తొస్సిపూడి ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు బోధన, అభ్యసన కార్యక్రమాల అమలు తీరును బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు సత్య ప్రకాష్ పరిశీలించారు. అలాగే అనపర్తిలోని బాపనమ్మ గుడి వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలనూ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు బోధనా విధానం, విజువల్ మోటార్ లెర్నింగ్ సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఎలా బోధన చేయాలో ఆయా ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట అనపర్తి మండల విద్యాశాఖాధికారి ఎన్.సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన గురుచరిత్ర పారాయణ యజ్ఞం



పారాయణలో పాల్గొన్న భక్తులకు శేష వస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి నుంచి ప్రారంభమైన గురు చరిత్ర పారాయణ యజ్ఞం ఈ గురువారంతో ముగిసింది. ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 10 గురువారాలు గురు చరిత్రను, ఒక వారం సాయి సచ్చరిత్రను పారాయణ చేశారు. ప్రతి గురువారం తెల్లవారుజామున ఇచ్చిన కాకడ హారతి అనంతరం ఉదయం 6 గంటలకు పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నం 2.30 గంటలకు పూర్తి చేస్తూ వచ్చారు. గత 15 సంవత్సరాలుగా ఈ పారాయణ యజ్ఞం జరుగుతోందని భక్త మండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పారాయణలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయంలో కొలువైన దేవతామూర్తుల శేష వస్త్రాలను కానుకగా అందజేశారు.

'రైట్' ఫ్యాకల్టీలకు డాక్టరేట్లు

రాజానగరం: భూపాలపట్నం రైట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ ఫ్యాకల్టీ సభ్యులు పి.రవికిరణ్, కె.హరితారాణి మలేషియాలోని లింకన్ యూనివర్సిటీ కాలేజీ నుంచి డాక్టరేట్ అందుకున్నారని కళాశాల చైర్మన్ జి.సాయిరాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరినీ గురువారం అభినందించారు.

ఇంటిపై పెంకులు తొలగించి చోరీ

సీతానగరం: ఇంటిపై పెంకులు తొలగించి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. బొబ్బిల్లంకకు చెందిన లంకే రత్నకుమారి ఈ నెల 15న తన ఇంటికి తాళం వేసి, వేరే ఊరిలో జరిగే ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి 17న ఇంటికి వచ్చి, తాళం తీసి లోపలకు వెళ్లి చూడగా, ఇంటిపై పెంకులు తొలగించి ఉన్నాయి. గదిలో పరిశీలించగా, బీరువా తాళం బద్దలు కొట్టి ఉంది. దానిలోని రూ.50 వేలు, నాలుగు గ్రాముల బంగారు చెవి కమ్మలు, వెండి పూజా సామగ్రి మాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది.

భార్యను వేధిస్తున్న భర్త అరెస్ట్

బిక్కవోలు: భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తను అరెస్ట్ చేసినట్టు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ బలభద్రపురానికి చొల్లంగి నాగలక్ష్మి, రాంబాబులల కుమార్తె శ్రీదేవి పుట్టుకతో మూగ, చెవిటితో బాధపడుతోంది. ఆమెకు గత ఏప్రిల్ కొత్తపేట మండలం కండ్రిగ గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సాయిప్రసాద్‌తో వివాహం చేశారు. అయితే పెళ్లయిన తర్వాత నుంచి భార్యను సాయి ప్రసాద్ శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. అలాగే అతడికి ఇది వరకే విజయవాడ చెందిన మహిళతో వివాహమై, పాప కూడా ఉంది. ఈ విషయాన్ని దాచిపెట్టి శ్రీదేవితో పెళ్లి చేశారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు సాయిప్రసాద్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు.

కుక్కల స్వైరవిహారం

- గ్రామాల్లో విచ్చలవిడిగా సంచారం
- కనిపించిన వారిపై దాడి
- బెంబేలెత్తుతున్న ప్రజలు



ఊలపల్లిలో సంచరిస్తున్న కుక్కలు

బిక్కవోలు: అనపర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలను కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేసి, గాయపరుస్తున్నాయి. వీటి కారణంగా చిన్నారులు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటేనే భయపడుతున్నారు. అలాగే పగలు, రాత్రి అనే తేడా లేకుండా ద్విచక్ర వాహన చోదకులను వెంబడిస్తున్నాయి. అలాగే గొర్రెలు, మేకలపైన కూడా దాడి చేసి గాయపరుస్తున్నాయి. వీటి బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

పలు ఘటనలు

- ఆగస్టు 15వ తేదీన బిక్కవోలు గ్రామంలో దిగవల్లి సతీష్, ఆశీర్వాదంతో పాటు ఎనిమిది మందిని ఓ కుక్క కరిచింది.
- ఈ నెల 16న తొస్సిపూడి చెందిన ఐదేళ్ల గణేష్ అనే బాలుడు బయట ఆడుకుంటుంటే కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడు గాయపడ్డాడు.
- ఈ నెల 17న కొమరిపాలెం గ్రామంలోని వాసరెడ్డి సత్యవతి ఇంటి వద్ద పని చేసుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి.
- పందలపాకలో గొట్టాపు కృష్ణవేణితో మరో ఇద్దరిపై దాడి చేశాయి. ఇదే గ్రామంలో షేక్ కరీమ్ ఇంటి వద్ద మేకలపై దాడి చేశాయి. ఈ ఘటనలో అతడికి సుమారు రూ.లక్ష వరకూ నష్టం కలిగింది.
- నియోజకవర్గంలో ప్రతి రోజూ ఒక్కటో, రెండో కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. బాధితుల్లో కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నాయి. మరి కొందరు అనపర్తి, కాకినాడలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు.



కొమరిపాలెం కుక్కదాడిలో గాయపడి మహిళ (ఫైల్)

భయాందోళన

గ్రామాల్లో ప్రతి రోజూ కుక్కల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతుండడంతో ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. స్కూల్‌కు వెళుతున్న పిల్లలు, జాగింగ్ చేసేవారు, ఇంటి వద్ద పనిచేసుకుంటున్న మహిళలు.. ఇలా అందరిపైనా కుక్కలు దాడి చేస్తున్నాయి. అయితే వీధి కుక్కల నివారణ చర్యలపై అధికారుల స్పందన కరవైంది. వీటి సంతానం విచ్చల విడిగా పెరిగిపోతోంది. వాటికి టీకాలు వేసి సంతానోత్పత్తి జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నియంత్రణకు చర్యలు చేపట్టాలి



"గ్రామాల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. వాటికి కనిపించిన వారిపై దాడులు చేస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు భయపెడుతున్నాయి. వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి."

– దిగువల్లి వెంకటేశ్వరరావు, బిక్కవోలు

జగన్ దృష్టికి ఎంపీటీసీల సమస్యలు



తాడేపల్లి క్యాంపు ఆఫీసులో మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎంపీపీ జ్యోత్స్న తదితరులు

సీతానగరం: జిల్లాలోని ఎంపీటీసీ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టిలో ఉంచామని జిల్లా ఎంపీపీల అధ్యక్షులు, సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి ఆధ్వర్యంలో జగన్‌ను కలిశామన్నారు. ఎంపీటీసీలకు కొన్ని నెలలుగా కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించడం లేదని, అలాగే ప్రొటోకాల్ పాటించడం లేదని, దళితులపై అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని వివరించామన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు అంబటి రాజు, జిల్లా కార్యదర్శి అంబటి రమణ, గుర్రాల కృష్ణారావు, అంబటి రవిచంద్ర పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



జగన్నాథపురంలో గేదెకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కోరుకొండ: పశువులకు సోకుతున్న గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్టు పశుసంవర్థకశాఖ ఏడీ పి.ప్రభావతి తెలిపారు. మండలంలోని జగన్నాథపురంలో గురువారం టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువులు తీవ్రమైన జ్వరంతో నీరసిస్తాయని, పాల దిగుబడి బాగా తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో బూరుగుపూడి పశువైద్యశాల డాక్టర్ బి.సుప్రియ, సహాయకులు రవితేజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ సంక్షేమం



కొంకుదురులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



చంద్రేడులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వేణు శ్రీలక్ష్మి

బిక్కవోలు: మహిళల ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ బాగుంటుందని ఎంపీపీ తేతలి సుమ అన్నారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కొంకుదురు పీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్త పోటు, క్యాన్సర్, రక్త హీనత, క్షయ, ఎనీమియా, గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, పిల్లలకు టీకాలు వేశారు. పీహెచ్‌సీ వైద్యులు విజయలక్ష్మి మాట్లాడుతూ 196 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఆరికరేవుల సర్పంచి రెడ్డి నాగ వీరవేణి, తోస్సిపూడి మాజీ ఉప సర్పంచ్ తేతలి సూర్యచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రాజానగరం: కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో జరిగిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ శిబిరంలో 213 మంది వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశామని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బెనడిక్ట్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సరిత, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

రంగంపేట: మహిళల ఆరోగ్య పరిరక్షణే స్వస్త్ నారీ కార్యక్రమ లక్ష్యమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. చంద్రేడు సచివాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 254కు వైద్యపరీక్షలు చేశారు. ఎంపీహెచ్‌ఈఓ వి.తులసీదాస్, పీహెచ్ఎన్ కె.మేరీ హెలేనా, ఎంపీహెచ్ఎస్ కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రంగంపేట: రంగంపేట సెక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ, ఏడీబీ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.నటరాజన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కింది తెలిపిన ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

- రంగంపేట సబ్ స్టేషన్ పరిధిలో రంగంపేట టౌన్, పెద రాయవరం, చంద్రేడు, కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సుభద్రంపేట గ్రామాలకు విద్యుత్ నిలిచిపోతుంది.
- విజయ విశాఖ డెయిరీ ఫీడర్, కార్గిల్ ఫ్యాక్టరీ ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్, వడిశలేరు ఫీడర్, నల్లమిల్లి ఫీడర్ల పరిధిలో సరఫరా ఉండదు.
- వడిశలేరు సబ్ స్టేషన్ పరిధిలోని వడిశలేరు, ముకుందవరం, ఎస్టీ రాజాపురం గ్రామాలకు సరఫరా ఉండదు.
- ఈలకొలను సబ్ స్టేషన్ పరిధిలోని ఈలకొలను, అచ్యుతాపురం గ్రామాలకు, సింగంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సింగంపల్లి, నల్లమిల్లి, మర్రిపూడి గ్రామాలకు అంతరాయం కలుగుతుంది.

పల్లకడియం పరిధిలో..

రాజానగరం: పల్ల కడియం సబ్ స్టేషన్‌లో నిర్వహణపరమైన పనులు చేపట్టాల్సి ఉన్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇన్‌చార్జి జె.నటరాజన్ తెలిపారు. ఈ కారణంగా ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా వినియోగదారులకు విద్యుత్‌ని అందించేందుకు ప్రయత్నం చేస్తారని, ఈ సమయంలో ఏదైనా సాంకేతిక సమస్య ఏర్పడితే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగవచ్చన్నారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



రామేశ్వరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్క నాటుతున్న సీఈఓ లక్ష్మణరావు

పెదపూడి: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, ఆ గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం పెంచడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కాకినాడ జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు అన్నారు. రామేశ్వరం గ్రామంలో ఆయన గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు ఎరువును, దాన్ని ఎంతకు విక్రయిస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం వద్ద మొక్క నాటారు. అనంతరం క్లాప్ మిత్రలతో మాట్లాడుతూ చెత్త సేకరణ చేస్తున్న విధానంపై ఆరా తీశారు. అలాగే క్లాప్ మిత్రలు, పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు, తువాలు, చేతి గ్లౌజ్‌లను పంపిణీ చేశారు. ఐవీఆర్ఎస్ కాల్స్ పర్సంటేజీ 73 శాతం వచ్చినందుకు సచివాలయం కార్యదర్శి భోగరాజు ప్రసన్నాంజనేయులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శి భోగరాజు ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కోరుకొండ: కాపవరం సెంటర్‌లోని రాజ రాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 24 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఉత్సవాల పోస్టర్‌ను గురువారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నీరుకొండ బాబ్జీ ఆవిష్కరించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చిట్టిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్

రంగంపేట: లోక్‌సభ, అసెంబ్లీ నిర్వహణ, విధానాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్ర ప్రధాన విభాగ అధ్యాపకుడు బాబ్జీ అన్నారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు వి. పార్థసారథి ఆధ్వర్యంలో గురువారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో మూడో సంవత్సరం డిగ్రీ రాజనీతి శాస్త్రం చదువుతున్న విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



పెదపూడి పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ దుర్గాలక్ష్మి

పెదపూడి: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు వ్యవసాయ శాఖ కాకినాడ ఏడీ దుర్గాలక్ష్మి సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎన్.సత్య ప్రసాద్ అధ్వర్యంలో గురువారం పెదపూడిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిత్ర పురుగులను సంరక్షించుకోవాలని, శత్రు పురుగులను నిర్మూలన చేయాలని ప్రయోగాత్మకంగా వివరించారు. నానో యూరియా వాడకంతో రైతుకు శ్రమ, వ్యయం తగ్గుతుందని, దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం స్థానిక గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నానో యూరియా ఉపయోగంపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసు గౌడ్, వీఏఏలు దుర్గాప్రసాద్, శరణ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు



చినకొండేపూడిలో వంటకాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి సచివాలయం -2లో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చినకొండేపూడి, పెదకొండేపూడిలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా ఈ కార్యక్రమం జరిపారు. ఆకు కూరలతో చేసిన వంటలు, రాగి లడ్డూ, బాలామృతంతో తయారు చేసిన లడ్డూలు, కేక్‌లను ప్రదర్శించారు. పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎంలు సందర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కె.సుభాషిణి, జేఈ రాణి, ఎ.మంగ కుమారి, వి.సునీత, వి. శాంతి కుమారి, కె.సీత, కె.ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల నిరసన



రంగంపేటలో నిరసన తెలుపుతున్న గ్రామ రెవెన్యూ సహాయకులు



సీతానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద..



అనపర్తిలో తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

రంగంపేట: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని వారి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం శాంతియుత నిరసన తెలిపారు. సంఘ నాయకులు సుబ్బారావు, వీరబాబు, తాతారావు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలన్నారు. 60 ఏళ్లు పైబడిన ప్రతీ వీఆర్ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వీఆర్ఏలు నిరసన తెలిపారు. అనంతర తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్, మండల వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు కన్నెం రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శి మద్దాల దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి దాదాపు రెండేళ్లు అవుతున్నా, తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.

అనపర్తిలో..

అనపర్తి: గ్రామ రెవెన్యూ సహాయకుల దీర్ఘకాలిక అపరిష్కృత డిమాండ్ల సాధనకు రాష్ట్ర కమిటీ ప్రకటించిన కార్యాచరణలో భాగంగా వీఆర్ఏలు గురువారం తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనపర్తి యూనిట్ అధ్యక్షుడు ఎల్.రామారావు మాట్లాడుతూ అర్హులకు పదోన్నతులు, కారుణ్య నియామకాలు వంటి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 18, 19వ తేదీల్లో తహశీల్దార్ కార్యాలయం, 20న ఆర్డీవో కార్యాలయం, 22న కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతి పత్రాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో అనపర్తి మండల వీఆర్ఏల సంఘ గౌరవాధ్యక్షుడు దండకడియాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు షేక్ షాబాషా, కార్యదర్శి ఎల్.రాజు, కోశాధికారి బాల బాలాజీ, సభ్యులు పాల్గొన్నారు.